మత్తు.. యువత చిత్తు..!



ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి



ఓ ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్న పాత్ర

- జోరుగా గుడుంబా తయారీ..
- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- మత్తుకు చిత్తవుతున్న యువత
- అడ్డాగా మారుతున్న జన్నారం మండలం

జన్నారం: ఓ వైపు గుడుంబా తయారీ, మరో వైపు గంజాయి విక్రయం వెరసి యువకుల జీవితాలు నాశనం చేస్తున్నాయి. గుడుంబ తయారీతో గ్రామాల్లో నిరుపేదలు గుడుంబాకు బానిసలవుతున్నారు. మత్తు పదార్థాలు అరికట్టడంతో సంబంధిత అధికారులు విఫలమయ్యారని చెప్పొచ్చు. జన్నారం మండలంలోని వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, గుడుంబా సరఫరా సాగుతోంది.

గంజాయి మత్తులో యువకులు..

ఈ గంజాయి సేవిస్తున్న వారిలో ఎక్కువగా 13ఏళ్ల నుంచి 30ఏళ్ల వరకు యువకులే బానిసలుగా మారుతున్నారు. సాయంకాలం వేళ చెరువు కట్టలు, ఊరికి దూరమైన ప్రదేశాలను ఎంచుకొని గంజాయి సేవిస్తున్నారు. మండల కేంద్రంలోని పలు హోటళ్లలో కూడా గంజాయి నింపిన సిగరేట్లు సేవిస్తున్నట్లు సమాచారం. జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో యువకులు సుదూర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గుట్టలు, అడవి ప్రాంతాల్లోని గూడేల్లో నుంచి గంజాయిని తీసుకొస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఇందన్‌పల్లిలో ఓ యువకుడి వద్ద గంజాయిని పట్టుకోవడం, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ కేసులో మరో ముద్దాయిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు యువకులను బైండోవర్ కూడా చేశారు. ఓ మారుమూల గిరిజన గ్రామంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. కొన్ని రోజులుగా గంజాయి సరఫరా తగ్గినా, ఇటీవల కాలంలో మళ్లీ ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి వారానికి రెండు రోజులు జన్నారం మీదుగా కరీంనగర్, హైదరాబాద్ లాంటి నగరాలకు గంజాయి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇతర ప్రాంతాలకు తరలిస్తూ...

జన్నారం మండలంలోని పలు గ్రామాలు, తండాలలో గుడుంబా గుబాళిస్తోంది. వేకువజామున, అర్ధ రాత్రి గుడుంబా తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తయారీలో ఇప్పపువ్వుకు బదులుగా ప్రమాదకరమైన వస్తువులు వేస్తున్నట్లు తెలుస్తోంది. బెల్లం, పటికతో పాటు యూరియా, కుళ్లిన పండ్లు, టార్చిలైట్ బ్యాటరీలు, ఎండుగడ్డి వేస్తున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా ఆరోగ్యం పాడవుతుందని పలువురు పేర్కొంటున్నారు. చింతగూడ, తపాలపూర్, మొర్రిగూడ, హాస్టల్‌తాండా, కవ్వాల్, కలమడుగు, పొనకల్, దేవునిగూడ గ్రామాల్లోని పలువురు గుడుంబాకు బానిసలుగా మారి అనారోగ్యం పాలయ్యాయరని, కొందరు మృత్యువాత పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. నిత్యం గ్రామాల్లో బహిరంగంగానే సరఫరా జరుగుతున్నా సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో గంజాయి, గుడుంబా సరఫరా ఆపివేయాలని కోరుతున్నారు.

యువకుల తప్పటడుగు...

8వ తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు గంజాయికి బానిసలుగా మారుతున్నట్లు వివిధ సంఘటనల ద్వారా తెలుస్తోంది. మండలానికి చెందిన పలువురు యువకులు గంజాయికి బానిసై, పిచ్చి పట్టినట్లు వ్యవహరించడం వల్ల తల్లిదండ్రులు ఆసుపత్రులలో చికిత్స చేపిస్తున్నారు. ప్రముఖ సైకాలజిస్టు ప్రకాశ్ కూడా పలువురు విద్యార్థులను దత్తత తీసుకుని వారిని గంజాయి నుంచి దూరంగా ఉండేలా మార్చారు.



పొనకల్ చెరువు సమీపంలో గంజాయి సేవిస్తున్న యువకులు (ఫైల్)

పదుల సంఖ్యలో వస్తున్నారు...



జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో యువకులు గంజాయి భారిన పడుతున్నారు. కొందరు పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నారు. గంజాయికి బానిసలుగా మారారు. జిల్లా వ్యాప్తంగా 70మంది యువకులు నా వద్దకు రాగా, అందులో ఎక్కువ మంది 8నుంచి పదో తరగతి చదువుతున్న వారు ఉండటం దురదృష్టం. ఇందులో చాలా వరకు యువకులను కౌన్సెలింగ్ ఇస్తూ, గంజాయి నుంచి దూరం చేశాను.

– బాదవత్ ప్రకాశ్, సైకాలజిస్టు

ప్రత్యేక నిఘా పెట్టాం..

గంజాయి విక్రయాలు, సేవనం చట్టరిత్యా నేరం. గ్రామాల్లో యువకులు కొందరు గంజాయికి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నట్లు తెలిసింది. గ్రామాల్లో గంజాయి విక్రేతలు, సేవించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. యువకులకు, పాఠశాలల్లో సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి, గుడుంబా సరఫరా చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. గంజాయి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతుందో గమనించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అల్లం నరేందర్, సీఐ, లక్సెట్టిపేట

క్లుప్తంగా

నెన్నెలలో బస్‌షెల్టర్ కరువు



ఎండలో బస్సు కోసం ఎదురుచూస్తూ..

నెన్నెల: మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు ఎండలో, వానలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. కళాశాలకు వెళ్లే విద్యార్థులు బస్సు షెల్టర్ లేకపోవడంతో దుకాణాల షెడ్‌ల వద్ద ఎండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు రోడ్ల పైనే పడిగాపులు కాస్తున్నారు. నిలువ నీడ లేక, తాగేందుకు నీరు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చెన్నూర్‌లో ముగిసిన క్రికెట్ పోటీలు



ట్రోఫీ అందజేస్తున్న కౌన్సిలర్లు

చెన్నూర్: పట్టణంలోని దుబ్బాగూడెం మైదానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అంబేద్కర్ మున్సిపల్ స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో అరుణ్ ఎలెవన్ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, విక్కీ ఎలెవన్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో గెలుపొందిన అరుణ్ ఎలెవన్ జట్టుకు రూ.5వేల నగదు, ట్రోఫీ, ద్వితీయ స్థానంలో గెలుపొందిన విక్కీ ఎలెవన్ జట్టుకు రూ.2వేలు నగదు, ట్రోఫీలను పోటీ నిర్వహకులు, 4వ వార్డు కౌన్సిలర్ రెవెల్లి మహేశ్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మేడ సురేశ్ రెడ్డి, గాలిపల్లి సంతోశ్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత జన్నారం జూనియర్ టీం



విజేతగా నిలిచిన టీం

జన్నారం: సంత్ సేవలాల్ జయంతి పురస్కరించుకొని సేవలాల్ యువసేనా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో జన్నారం జూనియర్ టీం విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ఓం సాయి టీం నిలిచినట్లు నిర్వాహకులు బాదవత్ సాయికిరణ్ తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.25వేలను కెప్టెన్‌లకు నిర్వాహకులు సందేశ్, సాయికిరణ్ అందజేశారు. కార్యక్రమంలో సేవలాల్ మహారాజ్ భక్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాహనాలు ప్రారంభించరా..!



పార్కింగ్ ఏరియాలో నిలిపిన వాహనాలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ నుంచి గతంలో హిందువుల కోసం వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముస్లింలకు ఆఖరి సఫర్, క్రైస్తవులకు అంతిమయాత్ర పేరిట రూ.44లక్షల పట్టణ ప్రగతి నిధులతో రెండు వాహనాలను కొనుగోలు చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిందని నాడు ప్రారంభించక పోగా, ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలవుతోంది. గత పాలకవర్గంపై అవిశ్వాసంతో చైర్మన్, వైస్ చైర్మన్లు రాజీనామాతో ఈ వాహనాల ప్రారంభోత్సవం జరగలేదు. ఈ నెల 9వ తేదీన నూతనంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక జరిగింది. కొత్తగా వచ్చిన చైర్మన్, వైస్‌చైర్మన్లు గాని, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే చేత గాని ఆయా వాహనాలను ప్రారంభించకపోవడంతో, ముస్లింలు, క్రైస్తవులు ఎవరైనా మృతి చెందితే వాహనాలు ఉన్నా, ప్రారంభోత్సవం కాలేదనే సాకుతో వాటిని మున్సిపల్ అధికారులు ఇవ్వడం లేదు. కనీసం ఆయా వాహనాలను ప్రారంభించి, వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం. దీంతో గత నాలుగు నెలల నుంచి ఆ వాహనాలు మున్సిపల్ పార్కింగ్‌లోనే దుమ్ము పట్టి పోతున్నాయి. రోజుల తరబడి ఆయా వాహనాలను నడపకపోయినా, అవి పాడయ్యే అవకాశాలున్నాయని, వాటిని ప్రారంభించి, అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చేతబడులు నమ్మొద్దు

- బెల్లంపెల్లి రూరల్ సీఐ అబ్జలోద్దిన్



అవగాహన కల్పిస్తున్న సీఐ

నెన్నెల: మూఢ నమ్మకాలు, చేతబడులను ప్రజలు నమ్మొద్దని బెల్లంపెల్లిరూరల్ సీఐ అబ్జలోద్దిన్ అన్నారు. నెన్నెల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖర్జి, జంగల్‌పేట్ గ్రామాల్లో మంత్రాల నెపంతో ఫిర్యాదులు రావడంతో ఆదివారం ఎస్సై శ్యామ్‌పటేల్‌తో కలిసి ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. మూఢనమ్మకాల బారిన పడి ప్రజలు నష్టపోవద్దన్నారు. రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని ఈ రోజుల్లో చేతబడులు, మంత్రాలు అపోహలు వీడాలని సూచించారు. మూఢ నమ్మకాలను కొందరి స్వలాభం కోసం ప్రోత్సహిస్తున్నారని, వాటిని నమ్మి విలువైన జీవితాలను నాషనం చేసుకోవద్దన్నారు. అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించి, వారి సలహాలు, సూచనలు పాటించాలని పేర్కొన్నారు. మంత్రాల నెపంతో అనుమానంతో ఒకరి స్వేచ్ఛకు భంగం కలిగేలా దూషించడం, బంధించడం, ఇళ్లపై దాడి చేయడం లాంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, గ్రామ అభివృద్ధికి పాటు పాడాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

భీమారం ఎస్సైగా రాములు



భీమారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్సైగా బి.రాములు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రాజవర్ధన్ మంచిర్యాలకు బదిలీ కాగా కమాన్‌పూర్‌లో పనిచేస్తున్న రాములును ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు కొత్తగా బాధ్యతలు చేపట్టిన రాములు మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో శాంతిభద్రతలు కాపాడుతానని హామీ ఇచ్చారు.

స్మార్ట్ వర్క్‌తోనే సక్సెస్ సాధ్యం

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దెవేణి అర్జున్



మాట్లాడుతున్న అర్జున్

బెల్లంపల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో స్మార్ట్ వర్క్‌తోనే సక్సెస్ సాధ్యమవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మద్దెవేణి అర్జున్ అన్నారు. బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) కళాశాలలో ఆదివారం పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధతలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అర్జున్ మాట్లాడారు. పరీక్షల్లో నెగ్గడానికి పూర్వ పద్ధతిలో విద్యార్థులు చాలా హార్డ్‌వర్క్ చేస్తుంటారని తెలిపారు. కానీ అందుకు భిన్నంగా స్మార్ట్‌వర్క్ ఉత్తమ ఫలితం ఇస్తుందని వివరించారు. హార్డ్ వర్క్, స్మార్ట్‌వర్క్ పనితీరును రోజువారీ సంఘటనలను ఉదహరిస్తూ విద్యార్థులకు సవివరంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం చెబుతున్నప్పుడు ఏ విద్యార్థి అయితే సరైన ఫోకస్ పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారో ఆ విద్యార్థికి సక్సెస్ దొర కదన్నారు. శ్రద్ధగా పాఠం వినే విద్యార్థినే విజయం వరిస్తుందని పేర్కొన్నారు. తరగతి గదిలో ఏకాగ్రతగా విన్న విషయం ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. ఎక్కువ ఉత్సాహంగా అనిపించే సమయంలో కష్టంగా అనిపించే సబ్జెక్టు విషయాలను చదవడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి సబ్జెక్టుపై సరైన దృక్పథంతో సన్నద్ధం కావడం ద్వారా ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడానికి వీలు కలుగుతుందని వివరించారు. సబ్జెక్టులోని అంశాలపై ఇష్టాన్ని ఏర్పర్చుకుంటే మెదడు, శరీరం చురుకుగా పని చేస్తుందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం, సమయపాలన పాటిస్తూ తగినంత నిద్రపోవడం వల్ల పరీక్షల్లో ఏకాగ్రత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. రాత్రి వేళల్లో ఎక్కువ సమయం మేల్కొని చదవడం, సెల్‌ఫోన్‌లో చిట్ చాట్ చేస్తూ గడపడం వల్ల పరీక్షలు సరిగ్గా రాసే అవకాశాలు ఉండవన్నారు. విద్యార్థులకు వీడియోలు ప్రదర్శిస్తూ ప్రపంచంలో విజయాలు సాధించిన వ్యక్తుల కాలపట్టికను వివరిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఉపాధ్యాయులతో కలిసి వ్యక్తిత్వ వికాస నిపుణుడు అర్జున్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేవీపీ పొన్నం శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు వి.ప్రమోద్‌కుమార్, కొక్కుల రాజేశ్వర్, పొన్నాల రాజ్‌కుమార్, దత్త ప్రసాద్, వామన్, మిట్టా రమేష్, చంద్రశేఖర్, విజయ, రాకేష్, రవీందర్, వర్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



సన్మానిస్తున్న సంఘం నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజ శేఖర్‌ను మందమర్రికి చెందిన ఆదిజాంభవ సంఘం నాయకులు ఆదివారం కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాజనర్సు, అధ్యక్షుడు వాసాల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీదునూరి శంకర్, నాయకులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పాస్టర్లు

మందమర్రిరూరల్: ఈ నెల 11న రంగారెడ్డి జిల్లా జన్వాడ గ్రామంలోని మెథడిస్ట్ చర్చిపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్కేపీ ప్రేయర్ ఫెలోషిప్ యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరువతీసుకుని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు ప్రవీణ్, సామ్యేల్ రాజ్, జాషువ తదితరులు ఉన్నారు.

19, 20తేదీల్లో ఎమ్మెల్యే వినోద్ పర్యటన

బెల్లంపల్లి: ఈ నెల 19, 20తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పర్యటించి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు. 19న ఉదయం 9గంటలకు బెల్లంపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మేడారం సమ్మక్క, సారలక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తారు. 10.30గంటలకు ఆకెనపల్లి గ్రామానికి, 11–15 గంటలకు లింగాపూర్ గ్రామంలోని శివాలయం దేవాలయం దర్శించుకుని, 12గంటలకు బెల్లంపల్లికి చేరుకుని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2–30గంటలకు బట్వాన్‌పల్లి, పెర్కపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి, మధ్యాహ్నం 3–30గంటలకు చాకేపల్లి గ్రామానికి వెళ్లి సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తారు. 20వ తేదీన తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లో, 10–30గంటలకు తాండూర్‌లో, 11–30గంటలకు రేచినీ గ్రామంలో, 12గంటలకు కిష్టంపేట్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారు. మధ్యాహ్నం 1గంటకు సుమంగళి ఫంక్షన్ హాల్లో తాండూర్ మండలంలోని గ్రామ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం అవుతారు. సాయంత్రం 4–20గంటలకు పార్టీ మండల అధ్యక్షుడు ఈసా ఇంటికి వెళ్తారు. 5గంటలకు బోయపల్లిలో సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తారు.

సమస్యలు పరిష్కరించాలి

పాతమంచిర్యాల: ఓడ వాడ బలిజ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఓడవాడ బలిజ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడెంకి చందు, జిల్లా అధ్యక్షుడు బోడెంకి మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయిచంద్ర ఫంక్షన్ హాల్లో ఆదివారం జిల్లాస్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓడవాడ బలిజలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ఓడవాడ బలిజలకు కుల ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని, దీంతో ప్రభుత్వ సంక్షేమపథకాలు అందకుండా పోతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని కులధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్య సహకార సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంఘం వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓడవాడ బలిజ సేవా సంఘం జిల్లా కోశాధికారి గగ్గూరి రాజన్న, పట్టణ అధ్యక్షుడు జి.సత్తయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు పిట్టల దశరథం, నూరి కనకరాజు, రాజశేఖర్, సంజయ్, సాయి, మధనయ్య, కృష్ణ పాల్గొన్నారు.

జాతర పనుల పరిశీలన



సమ్మక్క జాతర పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గోదావరి నది తీరాన ప్రారంభం కానున్న సమ్మక్క, సారలమ్మ జాతర పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, వారికి అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాతర కోసం జిల్లాకు కోటి రూపాయల నిధులు మంజూరు చేసిందని, భక్తులకు అన్ని విధాల సౌకర్యాలు ఏర్పాటు చేసి జాతరను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగభూషణం, ఉమాదేవి, నిర్వాహకులు రత్నాకర్, నాయకులు పింగిళి రమేష్, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

మంచిర్యాలటౌన్: రాముని చెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును ఆదివారం సన్మానించారు. రాముని చెరువు కట్టపై ప్రతిరోజు వందలాది మంది వాకింగ్ చేస్తున్నారని, చెరువు అభివృద్ధి పనులను చేపట్టేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రావు, బూర్ల జ్ఞాని, జాయింట్ సెక్రటరీ పి.రాంరెడ్డి, సాగర్ల రవి, అంజన్న, సలహాదారులు ఎస్టీ రావు, సందీప్ కల్యాణ్, సీహెచ్. రామస్వామి, రాజయ్య, బాలయ్య, బి.లక్ష్మీనారాయణ గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

‘పుచ్చ’సాగుకు ప్రోత్సాహమేది ?

తాండూర్: అసెంబ్లీ నియోజకవర్గంలో సారవంతమైన నేలలున్నా ఆరుతడి పంటల సాగుకు నోచుకోవడం లేదు. ఎర్రరేగడి, ఇసుక నేలలు అపారంగా ఉన్నా సరైన ప్రోత్సాహం లేక రైతులు ముందుకు రాలేక పోతున్నారు. ప్రధానంగా ఎండాకాలం సీజన్‌లో సాగుచేసే పుచ్చకాయల పంట గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ఉద్యానశాఖ అధికారులు అనుసరిస్తున్న తీవ్ర నిర్లక్ష్యంతో అత్యల్ప విస్తీర్ణంలో పంట సాగు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయనే విమర్శలు ఉన్నాయి. పంట సాగు పడిపోవడంతో అనివార్యంగా పుచ్చకాయలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే దుస్థితి ఏర్పడింది. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉన్నాయి. దశాబ్దకాలం క్రితం వరకు దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా పుచ్చసాగు కాగా ప్రస్తుతం భీమిని, కన్నెపల్లి, నెన్నెల మండలాల్లో అక్కడక్కడా అత్యల్ప విస్తీర్ణంలో పుచ్చ సాగవుతోంది. ఆయా మండలాల్లో దాదాపు 50ఎకరాలకు లోబడి ఆరుతడి పంటను పండిస్తుండగా, మిగిలిన బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, వేమనపల్లి మండలాల్లో పుచ్చపంట కానరాకుండా ఉంది.

పత్తి పంటే ప్రధానం...

అసెంబ్లీ నియోజకవర్గంలో పుచ్చపంట సాగు పడిపోయి పత్తి ప్రధాన పంటగా కొనసాగుతోంది. తెల్లబంగారం సాగులో అనేక ఆటుపోట్లను చవిచూస్తున్నా కూడా రైతులు ఆ పంటను వీడటం లేదు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. పత్తి సాగుకు అలవాటు పడటంతో ఖాళీ భూములు కానరావడం లేదు. ఎండాకాలం సీజన్ వచ్చే వరకు గ్రామాల్లో పత్తి సేకరణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఆరుతడి పంటల జోలికి వెళ్లలేకపోతున్నట్లు తెలుస్తోంది.

అవగాహన కల్పించని అధికారులు..

ఉద్యానశాఖ అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పిండంలో నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు. గ్రామాలను సందర్శన చేయడం లేదు. సీజన్‌కు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించాల్సి ఉన్నా, మీనామేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతి కొద్ది మంది రైతులు మాత్రం పుచ్చ పంట సాగుపై ఉన్న మమకారాన్ని చంపుకోలేక 10–20గుంటలకు మించి పంట సాగుకు ముందుకు రాలేకపోతున్నారు. సబ్సిడీ విత్తనాల సరఫరా నిలిపివేయడం, రాయితీలు కల్పించకపోవడం వల్ల కూడా పుచ్చపంట సాగు పడిపోవడానికి మరో కారణంగా చెబుతున్నారు.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా...

ప్రస్తుత రోజుల్లో పుచ్చకాయలకు మార్కెట్లో మంచి ధర పలుకుతోంది.పెరుగుతున్న ధరలతో సమానంగా పుచ్చకాయల ధర మండిపోతోంది. గతంలో రైతులు కేవలం కాయ సైజును అంచనా వేసి తోచిన ధరకు అమ్మకాలు చేయగా, మారిన ప్రస్తుత పరిస్థితుల్లో పుచ్చకాయలను తూకం వేసి అమ్ముతున్నారు. ప్రస్తుతం కిలోకు రూ.20నుంచి 25చొప్పున ధర చెబుతున్నారు. కాయ ఎంత బరువు ఉంటే అంత అదనంగా ధర చెల్లించి కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. ముందు వేసవి వచ్చే వరకు కాయల ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉంటాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. స్థానికంగా పుచ్చకాయలను సాగు చేసినట్లైతే ధర పెరుగుదలకు ఆస్కారం ఉండేది కాదు. కొనుగోలు దారులకు మద్దతు ధర దక్కడంతో పాటు పండించిన రైతులకు ప్రయోజనం కలిగేది. పంటసాగు పడిపోయి రైతులు, కొనుగోలు దారులకు ఆశాజనకమైన పరిస్థితులు లేకుండా పోయాయి.

ఫేర్‌వెల్ హంగామా..!

దండేపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆదివారం ఫేర్‌వెల్ వేడుకలు, కాలేజీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని ఆడి పాడి ఎంజాయ్ చేశారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు